# మాలలకు రోస్టర్ పాయింట్లను కేటాయించాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** మాలలకు రాజ్యాంగ బద్ధ హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం చేసిన రోస్టర్ పాయింట్ల కేటాయింపును తక్షణమే సవరించి విద్యా, ఉద్యోగ రంగాలలో న్యాయం చేయాలని మాల మహానాడు జాతీయ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క్‌కు వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా జి.చెన్నయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు, ఉప కులాలకు తీరని అన్యాయం జరిగిందని, రోస్టర్ పాయింట్లు కేటాయింపులో విద్యా, ఉద్యోగాలలో తీరని అన్యాయం జరిగిందని, భవిష్యత్తులో మాలలకు, ఉప కులాలకు విద్యా , ఉద్యోగాలలో ఏలాంటి అవకాశాలకు లేకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రోస్టర్ పాయింట్‌లను సవరించి, జివోను విడుదల చేయాలని ఆయన కోరారు. తమ సమస్యలపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లలిత, నాయకులు సుధాకర్, మన్నే సాయికుమార్, కె.సాగర్ తదితరులు ఉన్నారు.



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క్‌కు వినతి పత్రం అందజేస్తున్న



# హైదరాబాద్ వార్త

# భారీ వర్షాలకు పోటెత్తిన వరదలు



- పొంగుతున్న జలాశయాలు
- గండిపేట వద్ద 12.గేట్లు, హిమాయత్ సాగర్ వద్ద 9.గేట్లు ఎత్తిన అధికారులు
- పాతనగరంలో ఉధృతంగా మూసీ నది

**నార్సింగి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర శివారుల్లో ఉన్న జంట జలాశయాలకు వరద నీరు పోటెత్తుతుంది. దీంతో జలాశయాలు పూర్తిస్థాయిలో నిండి పొంగుతున్నాయి. జల మండలి అధికారులు అప్రమత్తమై ఈ జంట జలాశయాలలోని నీటిని ఈసీ,మూసీ నదులలోకి వదిలి పెడుతున్నారు. దశాబ్దాల తరబడి హైదరాబాద్ మహా నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్న జంట జలాశయాలు పూర్తి సామర్థ్యంతో నిండడం ఇటు జల మండలి అధికారులను అటు నగర ప్రజలను ఆనందానికి గురి చేస్తుంది. దీంతో వచ్చే రెండేళ్ల వరకు రాజధానిలో నీటి సమస్య తలెత్తదన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

గండిపేట జలాశయం ఎగువ ప్రాంతాలైన వికారాబాద్, మోమిన్‌పేట్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట్ మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరదలు వచ్చాయి. గంట గంటకు గండిపేట జలాశయంలో నీటి మట్టం పెరుగడంతో నిశితంగా పరిశీలించిన జల మండలి డిజిఎం నరహరి శుక్రవారం ఉదయం 10.గంటలకు 4.గేట్లను 3.ఫీట్ల మేర ఎత్తి మూసీలోకి వరద నీటిని వదిలిపెట్టారు. వరద ఉధృతి మరింత పెరగడంతో మధ్యాహ్నం 12.గంటలకు 8.గేట్లను 5.ఫీట్ల మేర ఎత్తి మూసీలోకి 4,096కూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. ఒకటిన్నర గంటలకు 10.గేట్లను 6.ఫీట్ల మేర ఎత్తారు. మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో 11.గేట్లను 7.ఫీట్లు, సాయంత్రం ఐదు గంటలకు 11.గేట్లు 9.ఫీట్ల మేర, ఐదున్నర గంటలకు 12.గేట్లు 9.ఫీట్ల మేర ఎత్తి 10,668.క్యూసెక్కుల వరద నీటిని మూసీలోకి వదలిపెట్టారు. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 1790 అడుగులు కాగా ప్రసుత్తం 1789.40.అడుగుల నీరు ఉంది. జలాశయంలోకి 8.వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 10,668. క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెడుతున్నారు.

హిమాయత్ సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50అడుగులు కాగా ప్రస్తుతం 1763.10అడుగుల నీరుంది. ఈ జలాశయం ఎగువ ప్రాంతాలైన చేవెళ్ల, మొయినాబాద్, శంషాబాద్ మండలాల్లోని వాగులు, వంకలు పొంగి పొర్లుతూ భారీ ఎత్తున వరద నీటిని మోసుకు వస్తున్నాయి. ఉదయం 10.గంటలకు కేవలం 2.గేట్లు 3.ఫీట్ల మేర ఎత్తి ఈసీ వాగులోకి నీటిని వదిలిపెట్టారు. మధ్యాహ్నం 2.గంటలకు 4.గేట్లు, 2.గంటలకు 5.గేట్లు, సాయంత్రం 6.గంటలకు 9.గేట్లు 5.ఫీట్ల మేర ఎత్తి 14,446.క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెట్టారు.

**నిలిచిపోయిన రాకపోకలు :**

గండిపేట జలాశయం వద్ద 11.గేట్లను 7.ఫీట్ల మేర ఎత్తి వరద నీటిని మూసీ నదిలోకి వదిలిపెట్టడంతో ఒక్కసారిగా వరద నీరు పెరిగిపోయింది. నార్సింగి వద్ద ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ గేటు వద్ద బ్రిడ్జి పైనుంచి 3.అడుగుల మేర వరద నీరు పారుతుంది. అలాగే నార్సింగి-మంచిరేవుల గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి పైనుంచి 3.అడుగుల నీరు వెళ్లడంతో నార్సింగి పోలీసులు ఈ రెండు బ్రిడ్జిల వద్ద పికెట్లను ఏర్పాటు చేసి, ఇటువైపు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో నార్సింగి-మంచిరేవుల గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక హిమాయత్ సాగర్ జలాశయం వద్ద 6.గేట్లు 3.ఫీట్ల మేర ఎత్తి నీటిని ఈసీ నదిలోకి వదులడంతో పోలీసు అకాడమి నుంచి రాజేంద్రనగర్ వైపుకు వెళ్లే ఔటర్ సర్వీసు బ్రిడ్జి పైనుంచి వరద పారుతుంది. దీంతో ఇక్కడ రాజేంద్రనగర్ పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపి వేశారు.



హిమాయత్ సాగర్ గేట్ల నుంచి ఈసీలోకి వస్తున్న వరద దృశ్యం



నార్సింగి-మంచిరేవుల బ్రిడ్జి పైనుంచి పారుతున్న నీటి దృశ్యం

# శృంగేరి శంకరమఠంలో ఇంద్రాణి అలంకారంలో శారదాంబ

**హైదరాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** నల్లకుంటలోని శ్రీ శృంగేరి శంకర మఠంలో శ్రీ శారదా శరన్నవ రాత్రుల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయంలో కొలువుతీరని శ్రీ శారదాంభ శుక్రవారం 'ఇంద్రాణి అలంకారము'లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో సర్వసేవ, లక్ష కుంకుమార్చన, ఉదయాస్తమాన పూజ, స్వర్ణకమల పూజ, సప్తశతి పారాయణ, సువసిని పూజ, శ్రీ చక్రార్చన సర్వపూజ తదితర పూజా, సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి.ఈ సందర్బంగా సుమారు నాలుగువేల మందికి అన్నసంతర్పన చేశారు.



శ్రీ శృంగేరి శంకరమఠంలో ఇంద్రాణి అలంకారములో భక్తులకు కొలువుతీరిన శ్రీ శారదాంభ

# జూబ్లీహిల్స్ బిఆర్ఎస్‌గా అభ్యర్థిగా మాగంటి సునీతా గోపీనాథ్

### -కెటిఆర్‌ను కలిసిన అభ్యర్థి



**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 26, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో శుక్రవారం మాగంటి సునీతా గోపీనాథ్ బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిశారు. పుష్పగుచ్ఛాలను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆమెతోపాటు కుమార్తెలు అక్షర, దిషిర, కుమారుడు వాత్సల్య ఉన్నారు. మె జార్టీతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ స్థానాన్ని గెలుచుకోవాలని ఆమెకు సూచించారు. పార్టీ తరుపున గెలుపుకు అవసరమైన పూర్తి మద్దతును అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, కార్పొరేటర్లు దేదీప్యరావు, వెల్దండ వెంకటేష్ తదితరులున్నారు.

# లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్‌మెన్



అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీకాంత్ గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త** కూకట్‌పల్లిలోని వసంత నగర్ సెక్షన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ లైన్మెన్ శ్రీకాంత్ గౌడ్ లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కారు. ఓ వినియోగదారుడు నుండి ఇంటికి వైర్లు 5 కేవీ నుంచి 11 కె.వి మార్చేందుకు రూ.30 వేలు లంచం అడిగాడు. ఇందుకుగాను అడ్వాన్స్‌గా రూ.11 వేలు లంచం తీసుకుంటుండగా శ్రీకాంత్ గౌడ్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా సెక్షన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

# హైదరాబాద్ శివార్లలో సేల్స్‌మన్ హత్య

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్న ఓ యువకుడు దారుణ హత్య కు గురయ్యాడు. ఈ సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధి లో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జల్‌పల్లి శ్రీరాంకాలనీ లోని ఓ కలర్ ప్లాంట్ అండ్ కెమికల్స్ కంపెనీలో టేక్‌చంద్ తివారీ అనే యువకుడు సేల్స్‌మన్‌గా పని చేస్తూ కంపెనీకి సంబంధించిన గోదామ్ రూంలో నివసిస్తున్నాడు. అదే రూంలో ఇమ్రాన్ అనే యువకుడు కూడా ఉంటున్నాడు. అయితే వీరిద్దరి మధ్య కొన్ని విష యాల్లో తరచుగా గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శుక్ర వారం ఉదయం రూమ్‌లో టేక్‌చంద్ తివారీ రక్తపు మడుగులో చని పోయి ఉన్నాడు. తలపై తీవ్ర గాయాలు అదే విధంగా శరీరంపై రెండు చోట్ల గాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పహాడీషరీఫ్ పో లీసులకు సమాచారం అందడంతో వారు సంఘటనా ప్రాంతానికి చేరుకొని విచారణ జరిపారు. ఘటనా ప్రాంతాల్లో హత్యకు ఉపయోగించినట్లుగా భావిస్తున్న ఒక కత్తి, లాంగ్ స్టిక్ లభించాయి. అయితే టేక్‌చంద్ తివారీ తో గొడవలు ఉన్న ఇమ్రాన్ కనిపించకపోవడంతో అతని కోసం గాలిస్తున్నారు. హత్య కేసును నమోదు చేసుకొని పహాడీషరీఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బతుకమ్మ కుంట ప్రారంభోత్సవం వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబరు 26,ప్రభాతవార్త:** బతుకమ్మ కుంట ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరగాల్సి న కార్యక్రమాన్ని ఆదివారానికి వాయిదా వేశారు. హైదరాబాద్ నగరంలోని బాగ్ అంబర్పేటలోని బతుకమ్మ కుంట ఆక్రమణకు గురైంది.పెద్దమొత్తంలో భవంతులు వెలిశాయి. మిగిలిన కొద్ది స్థలం కూడా కబ్జాదారుల చేతుల్లో ఉంది. దాన్ని వాహనాల పార్కింగ్ స్థలంగా వినియోగించుకునేవారు. ముళ్ల కంపలు, చెత్తాచెదారం వేసేవారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత బతుకమ్మ కుంట ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ దస్త్రాలను ఆధారాలుగా చూపారు. రంగంలోకి దిగిన హైడ్రా.. ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. న్యాయపరమైన అడ్డంకులను ఎదుర్కొంది. దాదాపు రూ.7.15 కోట్లు వెచ్చించి ఆధునికీకరణ పనులు చేపట్టింది. పిక్నిక్ స్పాట్గా తీర్చిదిద్దింది. చిన్న పిల్లలు ఆడేందుకు ఆటస్థలం, వృద్ధులు సేద తీరేందుకు బెంచీలు తదితరాలు ఏర్పాటు చేసింది. చుట్టూ మెట్లతో కాంక్రీట్ గోడ కట్టింది. ప్రస్తుత వర్షాలకు కుంటలో నిండుగా నీరు చేరి జలకళ సంతరించుకుంది.

# బేగంపేటలో రోడ్లపై ఆగని మురుగు పరుగు



చికోటి గార్డెన్‌లో పొంగి రోడ్లపై పారుతున్న మురుగు నీరు.

**బేగంపేట సెప్టెంబరు 26,ప్రభాతవార్త** బేగంపేట డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్ హోల్స్ నుంచి మురుగు రోడ్లపై పారుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని నాలా పరివాహక బస్తీలైన బ్రాహ్మణవాడీ, ఆర్ఆర్‌గోపాల్ కాంపౌండ్,ప్రకాశంనగర్,పంచెకట్టు గల్లీ,చికోటి గార్డెన్,భగవంతాపూర్ రో డ్డు,రసూల్‌పురా చౌరస్తా సమీపంలోని రసూల్‌పురా మెట్రో స్టేషన్ తో పాటు మోతీలాల్ నెహ్రూనగర్ ప్రధాన రోడ్డు,శ్యాంలాల్ బిల్డింగ్ శ్రీ విజయగణపతి ఆలయం జంక్షన్ సమీప ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నా సంబంధిత శాఖాధి కారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆందోళణ వ్యక్తం చేస్తున్నారు.నగరం నడిబొ డ్డున ఉన్న బేగంపేట డివిజన్‌లో ప్రధాన రోడ్లతో పాటు గల్లీల్లో కూడా డ్రైనేజీ నీరు మ్యాన్ హోల్స్ నుంచి బయటకు వస్తుండటంతో ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నా రు.ప్రధాన రోడ్లపై యదేశ్చగా పారుతుండటంతో వాహనదారులు సైతం తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.వాటర్‌వర్క్స్ శాఖ అధికారులు మాత్రం ఈ సమస్యలపై దృష్టి పెట్టడంలో ఘోరంగా వైఫల్యం చెందారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఒక వైపు కూకట్‌పల్లి నాలా లో నీటి ఉదృతి పెరగడం,ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రోడ్లపై నిల్చి న నీరు డ్రైన్లలోకి చేరుతుండటం,మరికొన్ని ప్రాంతాల్లో కర్రీ పాయింట్ల వ్యర్థాలు మ్యాన్ హోల్స్‌లో పడవేస్తుండటం,శ్యాంలాల్ బిల్డింగ్ తాతాచారి కాలనీ తదితర ప్రాంతాల్లో పశువుల పేడ,ఇతర వ్యర్థాలను సైతం మ్యాన్ హోల్స్ మూతలు తొలగించి లోపల పడవే స్తుండటంతో ఈ సమస్య ఎక్కువగా ఉత్పన్నమవుతుందని,వాటర్ వర్క్స్ సిబ్బంది పేర్కొనడం గమనార్హం.ఇలాంటి వారిపై నిఘా లేకుంటే డివిజన్ నిత్యం మురుగు నీరు పొంగి పొర్లి రోడ్లపైకి చేరుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.దీంతో పాటు ప్రతి ఏటా కూకట్‌పల్లి నాలాలో ప్రతి ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి పూడిక తీత పనులు చేపడుతున్నా నాలాలో నీటి ప్రవాహం మందగించడంతోనే ఈ సమస్య తలెత్తుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు బేగంపేట డివిజన్‌లోని వివిధ బస్తీల్లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# భారీ వర్షంతో నగరం అతలాకుతలం

- నదులను తలపించిన రహదారులు
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు
- నలుదిక్కులా కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్





**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త** వందంటే వర్షం కురుస్తోంది..కుండతో పోసినట్టు..ఆకాశానికే చిల్లు పడిందా.. మేఘాలు పగిలి ఒకేసారి పడిపోయాయా అనే విధంగా మరోసారి నగరంలో భారీ వర్షం కురిసింది.మహానగరంలో శుక్రవారం భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఏకధాటిగా మూడుగంటల పాటు కుంభవృష్టితో జనజీవనం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. రోడ్లన్నీ నదులను తలపించాయి. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి నలుదిక్కులా కిలో మీటర్ల కొద్ది ట్రాఫిక్ స్తంభించింది. విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు నరక యాతన పడ్డారు. ముందుకు సాగేందుకు గంటల కొద్ది సమయం పట్టింది. పలు ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లు, ఫ్లైఓవర్ల కింద భారీ ఎత్తున వర్షపు నీరు నిలిచింది. రోడ్లపై భారీ వరద నీరు చేరడంతో వాహనాలు నీటమునిగాయి. ఓపెన్ నాలాలు, మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. ద్విచక్రవాహనదారులు, పాదచారులు వర్షం నుండి తప్పించుకోవడానికి ఫ్లైఓవర్లు, దుకాణాల షెడ్ల కింద తలదాచుకోవాల్సి వచ్చింది. ప్రధాన రోడ్లన్నీ నదులను తలపించాయి.రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది.రాత్రి పొద్దుపోయే దాకా వాహనాలు ముందుకు కదలలేదు.

**రోడ్లన్నీ జలమయం..**

శుక్రవారం ఉదయం నుంచి ఏకధాటి వర్షం కురవడంతో వరద నీరు రోడ్లపై భారీగా వచ్చి చేరింది. మెకాళ్లలోతు నీరు ఆగడంతో వాహనాలు నీటమునిగాయి. ప్రధానంగా ఖైరతాబాద్, అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ కింద భారీగా వర్షపు నీరు చేరింది. ఇదే పరిస్థితి పలు ప్రాంతాల్లో నెలకొంది.భారీ వర్షం ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, మేడ్చల్ సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడ్డాయి. వైశాలి నగర్, నవీన్ నగర్, ఓయూ కాలనీ, మూన్ కేఫ్ ఫీడర్, ఐడీపీఎల్, వసుధ, మధురానగర్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై ఫారిన్ మెటీరియల్స్ పడటంతో బ్రేక్ డౌన్ అయ్యాయి.కుండపోత వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ అతలాకుతల మైంది. జనజీవనం స్తంభించింది. ఖైరతాబాద్ నుంచి బేగంపేట్, మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి, గచ్చిబౌలి నుంచి కొండాపూర్, పంజాగుట్ట నుంచి గచ్చిబౌలి, కూకట్‌పల్లి నుంచి మియాపూర్, శేరిలింగం పల్లి నుంచి హైటెక్ సిటీ, మాదాపూర్, హయత్‌నగర్ నుంచి మలక్‌పేట, బషీర్ బాగ్ నుంచి కోఠి, ట్యాంక్‌బండ్ ఎస్పీరోడ్, ఆర్పీరోడ్ వరకు భారీగా ట్రాఫిక్ నిలి చిపోయింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, టోలిచౌకి, ఫిలిం నగర్ ఏరియాల్లో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మెహదీ పట్నం రోడ్డులో కూడా భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి, తార్నాక-హబ్సిగూడ-నాచారం రోడ్డులోనూ ఇదే పరిస్థితి కనిపిం చింది. జూబ్లీ హిల్స్ అపోలో రోడ్డులో ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనాలు ఎక్కడికక్కడ నిలి చిపోవడంతో వాహనదారులు నానా తిప్పలు పడ్డారు. ఒకపక్క వర్షం..మరో పక్క ట్రా ఫిక్ జామ్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

**హాట్ స్పాట్లపై జలమండలి దృష్టి..**

భారీ వర్షాల నేపథ్యంలో హాట్ స్పాట్లపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా చర్యలు చేపట్టేందుకు ఈఆర్‌టీ బృందాలను రంగంలోకి దింపింది.అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయం స్వర్ణజయంతి కాంప్లెక్స్ చుట్టూ పెద్ద ఎత్తున, వరదనీరు వచ్చి చేరింది. దీంతో సుమారు రెండు గంటల పాటు హెచ్ఎండీఏ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వివిధ పనులపైన స్వర్ణజయంతి కాంప్లెక్స్‌కు వచ్చిన వ్యక్తులు అక్కడి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాంప్లెక్స్‌లోని సెల్లార్లోకి సైతం వరదనీరు వచ్చి చేరింది.

# ఈఎంఎస్ అప్లికేషన్‌తో లీజు చెల్లింపులు సులభం

### -జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** పురపాలక మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, మోడల్ మార్కెట్లు, లీజు భూములు వంటి ఆస్తుల నిర్వహణను మరింత ప్రభావవంతంగా నిర్వహించడానికి జీహెచ్ఎంసీ ఆధునిక డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్టేట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎంఎస్) పేరుతో రూపొందించిన ఈ యాప్‌ను సెప్టెంబర్ 24న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు.కమిషనర్ ఆర్.వి. కర్నన్, కమిటీ సభ్యులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈఎంఎస్ ద్వారా లీజుదారులు తమ లీజు చెల్లింపులు, అద్దె మొత్తాలను ఆన్‌లైన్‌లోనే సులభంగా చెల్లించవచ్చు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం, వ్యవస్థలో సమర్థత పెరగనుంది. మానవ జోక్యం తగ్గి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందుతాయి. వినియోగదారుల ఫ్రెండ్లీగా రూపొందించిన ఈ యాప్‌లో డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్ వివరాలు రియల్‌టైమ్‌లో కనిపిస్తాయి.

ఫీల్డ్ స్థాయి నుంచి హెడ్ ఆఫీస్ వరకు మానిటరింగ్‌కు ఇది దోహదపడుతుంది.పురపాలక ఆస్తుల నిర్వహణను బలోపేతం చేయడం, ప్రభావంతంగా నిర్వహించడంలో ఈ డిజిటల్ వేదిక కీలకంగా నిలవనుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.

## అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ అష్టైశ్వర్య భోగభాగ్యాలు లభించాలి : కొలన్ శ్రీనివాస్ రెడ్డి



హోమంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి

**నిజాంపేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**

విజయదశమి మహోత్సవంలో భాగంగా ఐదవ రోజు శ్రీ మహాలక్ష్మి అమ్మవారు గజవాహనంలో అనుగ్రహించిందని, ఎవరైతే ఈ రోజు అమ్మవారిని దర్శించుకుంటారో వారికి అష్టైశ్వర్య భోగభాగాలు కలుగుతాయని కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేట్‌లో వెలసినటువంటి పురాతనమైనటువంటి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు అద్భుతమైనటువంటి కుబేర పాసుపతం చండీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారిని ఆరాదించడం జరిగింది. ఓ పక్క ప్రసాదాలతో మంగళ తోరణాలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారి యొక్క విజయదశమి అంగరంగ వైభవంగా జరుగుచున్నవి. ఈ కార్యక్రమంలో కొలన్ భద్రారెడ్డి, ఈరోజు అన్నదాతలు కొలన్ రాఘవేంద్ర రెడ్డి, మేఘనా రెడ్డి, ఐశ్వి, అయాతి, సరిత, నరేంద్ర రెడ్డి, సుప్రియ, మన్విత్ రెడ్డి, బొర్రా అశోక్, యాదిలాల్, త్రిపాలయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, నిజాంపేట్ గ్రామ పెద్దలు గ్రామస్తులు భక్తులు భారీగా పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న రాములు నాయక్



సేవా బాయ్ సేవా సంఘం నవరాత్రి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన దుర్గమాతకు ప్రత్యేక పూజలు చేసిన రాములు నాయక్ తదితరులు

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** సేవా బాయ్ సంఘం నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు అమ్మవారు శ్రీశ్రీ కాత్యాని దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం నాడు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ ఎస్సీఎస్టీ కమీషన్ సభ్యులు కిషన్ సింగ్, బిజెపి రాష్ట్ర నాయకులు బిక్కునాథ్ నాయక్‌లు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించార. ఈ సందర్భంగా వారికి సేవా బాయి సేవా సంఘం, నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ దిశా కమిటీ సభ్యులు చరణ్ సింగ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజేశ్ యాదవ్, హరిసింగ్, జాదవ్, బాలు నాయక్, జగన్‌సింగ్, మదన్ సింగ్ పాల్గొన్నారు.

## శ్రీగజలక్ష్మీ అమ్మవారి వద్ద కార్పొరేటర్ పూజలు



,శ్రీగజలక్ష్మీ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన కార్పొరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్.

**బేగంపేట సెప్టెంబరు 26, ప్రభాతవార్త**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో శ్రీగజలక్ష్మీ దేవి అమ్మ వారిని రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమెతో పూజలు నిర్వహింపజేసి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్పొరేటర్ వెంట చీరె సత్యనారాయణ (శ్రీకాంత్) తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ, పీజీ కోర్సులు, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ, డిప్లొమా కోర్సుల్లో 2025-26 సంవత్సరానికగాను ప్రవేశ గడువు చివరి తేదిని పొడగించినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతోపాటు పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ కోర్సులకు సంబంధించి రిజిస్ట్రేషన్, పరీక్ష రుసుం చెల్లింపునకు అక్టోబరు 10 వరకు పొడగించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు, ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో లేదా విశ్వవిద్యాలయ సహాయ కేంద్రాలు 040-23680333 /444/555 టోల్ ఫ్రీ నంబర్ 18005990101లో సంప్రదించాలన్నారు.

## చెడుపై మంచిని సాధించిన విజయమే విజయ దశమి : బండి రమేష్



పర్వత్‌నగర్ చౌరస్తాలో కనద దుర్గ అమ్మవారి విగ్రహానికి పూజల్లో పాల్గొన్న నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్.

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా ఉత్సవాలు నిర్వహించుకోవటం జరుగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ చౌరస్తాలో ఆలయ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనక దుర్గమ్మ మండపం వద్ద ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సుంకన్న, గోపిశెట్టి రాఘవేందర్, సతీష్‌గౌడ్, సుధాకర్, తూము సంతోష్, పల్లపు వేణు, శివ చౌదరి పాల్గొన్నారు.

## సంతోష్‌కుమార్‌ను సన్మానించిన డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకంలో భాగంగా సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ గృహాల పట్టాలు ఇప్పించడంలో సహకరించిన కాంగ్రెస్ పార్టీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి అదం సంతోష్ కుమార్‌ను లబ్ధిదారులు ఘనంగా సన్మానించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్రగా సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని డబల్ బెడ్ రూమ్ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న డబల్ బెడ్ రూమ్ లు ఇప్పించడం నా జీవితంలో ఒక గొప్ప అదృష్టం. ప్రతి కుటుంబం గృహంలో అడుగుపెట్టినప్పుడు వారి కళ్లలో కనిపించిన ఆ ఆనందం, ఆ తృప్తి హృదయాన్ని హత్తుకుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అభిషేక్, అనిల్ కుమార్, రవి చంద్ర కుమార్, బ్రహ్మజీ, జలేందర్ రెడ్డి, అమర్నాథ్ గౌడ్, సందీప్ రాజ్, శిల్పచారి, గంట రాజు, కిషోర్ యాదవ్, లబ్ధిదారులు బ్యాంకు రమేష్, ఐసాక్, రాజు, షీలా, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే ముఠా గోపాల్



చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి



చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ కే.లక్ష్మణ్



మడ్‌పోర్ట్‌లో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, సిఈఓ మధుకర్ నాయక్, జంపనప్రతాప్ తదితరులు



కూకట్‌పల్లి తూర్పుకమాన్ వద్ద ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



చాకలి ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పిస్తున్న రజక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెదలంక నవ్య



లంగర్ హౌస్ దోబీ ఘాట్‌లో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న లంగర్ హౌస్ దోబి ఘాట్ రజకులు.



జవహర్‌నగర్‌లో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న మాగంటి సునీతా గోపీనాథ్.



మైలార్దేవపల్లి డివిజన్‌లో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, తదితరులు

# చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకై కృషి చేద్దాం

## నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**నిజాంపేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**

మౌలిక వసతుల కల్పనతో నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజీరా నీటి నిర్వహణ, బిల్లులు, వీధి దీపాల నిర్వహణ, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, చెరువుల అభివృద్ధి, వర్షపు నీటి కాలనీలలో నిలిచిపోవడం, నత్త నడకన సాగుతున్న బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షి ంచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదకొండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లు, కాలనీలలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంజీరా నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటుతో పాటు చెరువుల పునరుద్ధరణకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామన్నారు. రానున్న రోజుల్లో కూడా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతేకాక మౌలిక వసతుల కల్పనలో భాగంగా టెండర్లు పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**చెరువులు, పార్కుల సుందరీకరణ....**

చెరువుల సుందరీకరణలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది చెరువులకు 22 కోట్లు, ఐదు పార్కుల అభివృద్ధికి 10 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని, ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు.

**స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు...**

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరచాలన్నారు. అలాగే నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లలో పెరుగుతున్న దోమల వ్యాప్తిని నివారించేందుకు ఫాగింగ్‌ను విధిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఎమ్మార్వో పూల్ సింగ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లలితాదేవిగా పెద్దమ్మతల్లి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు.

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి శుక్రవారం భక్తులకు లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక సభ్యులైన పి. విష్ణువర్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 22 నుంచి 27 వరకు ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. కాగా ఆదివారం అన్నదానం కార్యక్రమం ఉండదని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 29, 30 తేదీల్లో అన్నదానం తిరిగి కొనసాగుతుందన్నారు. శనివారం(నేడు) పెద్దమ్మతల్లి రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనుంది.

-శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబిక దేవి మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఉత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఉదయం మహాగణపతి పూజ, రుద్రాభిషేకం, శ్రీ చక్రార్చన, ఛండీ హోమం నిర్వహించారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారు శనివారం(నేడు) లలితాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## ఓట్ల చోరీతో గెలిచిన కేంద్ర ప్రభుత్వానికి నైతిక విలువలు లేవు : శ్రీకాంత్ గౌడ్

**హైదరాబాద్ సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:**

వ్యవస్థీకృతంగా ఎన్నికల్లో బిజెపి గెలిచేలా జరుగుతున్న ఓట్ల చోరీ కుట్ర బయటపడిందని అలా ఏర్పడిన ఈ ప్రభుత్వానికి ఎలాంటి నైతిక, రాజకీయ, చట్టబద్ధత ఉండదని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఈమేరకు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన ఓట్ల జాబితా ప్రత్యేక సవరణ మన ప్రజాస్వామ్యానికి తీరని ముప్పు అని ఓటర్ల జాబితాలో అక్రమాల కోసం భారతీయ జనతా పార్టీ చేస్తున్న మోసం అని మరొకసారి రుజువైందని అభివర్ణించారు. దేశ ప్రజలంతా దీని తీవ్రంగా ఖండించాలని ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. "ఓట్ల దొంగ గద్దె దిగు" అనే నినాదంతో, బీహార్ రాష్ట్రంలో ఇంటింటా ఇలాంటి నినాదం వినబడుతుందని అన్నారు. ఓటు చోరీ వ్యవహారంతో దేశ ప్రజల్లో ప్రజాస్వామ్యంపై నమ్మకం సడలిపోతుందని బిజెపి పార్టీ గెలిచే వ్యవస్థీకృతంగా క్రమ పద్ధతిలో జరుగుతున్న కుట్ర బహిర్గతమైందని ఈ ప్రభుత్వానికి ఎలాంటి నైతిక రాజకీయ చట్టబద్ధత లేదని నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, ధరల పెరుగుదల, విద్యా,వైద్య, వ్యవస్థల విధ్వంసం వంటివి బిజెపికి పట్టవని ఇప్పుడు ఓట్లు దొంగతనం చేస్తున్న వారు భవిష్యత్తులో ప్రజల గౌరవాన్ని రాజ్యాంగం కల్పించిన హక్కులను చోరీ చేసే అవకాశం ఉందని అన్నారు. మా నాయకుడు రాహుల్ గాంధీ ఓటు చోరీతో మరిన్ని కీలక అంశాలు బయటపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ఎన్డీఏ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, తెలంగాణలో సిడబ్ల్యుసిడి భేటీ నిర్వహించిన ఐదు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు రెండు నెలల్లో బీహార్ మహ ఘట్ బంధన్ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ప్రశంస.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ, ఈ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లునూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.



## కాంట్రాక్టర్లకు తక్షణమే రూ.1000 కోట్ల బకాయిలు చెల్లించాలి

**సైఫాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ,బిసి,మైనార్టి గురుకుల హాస్టల్స్ 1053కు కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్, కిరాణా సరుకులు, కేటరింగ్ సర్వీసెస్ సప్లయి దారులకు చెల్లించవలిసిన 1000 కోట్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లిచాలని తెలంగాణ గురుకుల కాంట్రాక్ట్ జెఎసి సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. లేని పక్షంలో దసరా పండుగ తరువాత నిరసన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని జెఎసి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి వ్యవస్థాపకులు నల్లా రాధాకృష్ణ, కన్వీనర్లు కె.విజయ్‌కుమార్, జ్యోతి మాట్లాడుతూ ఐదు వేల మంది కాంట్రాక్టర్లందరూ గురుకులాల్లో చదువుకుని కాంట్రాక్టర్లుగా మారారని, నిరుపేద కుటుంబాల నుంచి వీరికి స్వయం ఉపాధిగా జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. గత ఆరు నెలల నుంచి ఈ కాంట్రాక్టర్లు గత ఆరు నెలలుగా బయట నుంచి అప్పులు తెచ్చి సరుకుల సప్లయి చేయడం మూలంగా ఎలాంటి ఆదాయం లభించడం లేదని తక్షణమే మా యందు దయ ఉంచి బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జిల్లాల కలెక్టర్లకు, సంబంధిత శాఖ మంత్రి, ఉన్నతాధికారులకు వినతి పత్రాలను సమర్పిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు అశోక్, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

## తెలంగాణ సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా బతుకమ్మ వేడుకలు



ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో మహిళలకు బతుకమ్మ వేడుకల్లో కానుకలు అందజేస్తున్న నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి.

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :**

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా బతుక్మ వేడుకలను నిర్వహించుకోవడం ఆనవాయితీ అని జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలను విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోటా నీలిమా పాల్గొన్నారు. మహిళలు రంగురంగు పూలతో అందంగా అలంకరించి బతుకమ్మను ఆట పాటలతో నృత్యాలతో సంబరాలు జరుపుకున్నారు. మహిళలందరికీ కంజర్ల విజయలక్ష్మి చీరలను పంపిణీ చేశారు.

## విహెచ్‌పి ఆధ్వర్యంలో కుమారి పూజ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**

విశ్వహిందూ పరిషత్ మహంకాళి జిల్లా ఆధ్వర్యంలో సామాజిక సమరసత అభియాన్‌లో భాగంగా కుమారి పూజ, సింధూర కుంకుమ అర్చన ఘనంగా నిర్వహించారు. పద్మారావునగర్ లోని శివానంద ఆశ్రమంలో శుక్రవారం 51 మంది బాలికలకు కుమారి పూజ, అనంతరం 108 మంది మహిళల చేత సింధూర కుంకుమార్చన జరిగింది. ముఖ్యఅతిథిగా భద్రాచలంలోని గీతాశ్రమ పీఠాధిపతి విశ్వాత్మానందగిరి స్వామి హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బి. నరసింహమూర్తి, సామాజిక సమరసతా సమన్వయకర్త ధనుంజయ, వీరేశలింగం రాఘవేంద్ర మోహన్ రావు, మహంకాళి జిల్లా అధ్యక్షులు డాక్టర్ సోమనాథ్, కార్యదర్శి అనంత బాగూర్, విహెచ్ పి జిల్లా కార్యదర్శి సుకుమార్, అనిల్, శోభారాణి, వసుమతి, గాయత్రి, దుర్గావాహిని అధ్యక్షురాలు భవాని గాయత్రి, మాతృశక్తి అధ్యక్షురాలు మల్లీశ్వరి, శివానంద ఆశ్రమ ఇంచార్జి సుధీర్, సంజయ్ హాజరయ్యారు.

## బతుకమ్మ పండుగ సంప్రదాయాలకు ప్రతీక



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో జాహ్నవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. విద్యాసంస్థల అధినేత ఏ.పరమేశ్వర్, వైస్‌చైర్మన్ ఏ.లక్ష్మి, ప్రిన్సిపల్స్ అధ్యాపకులు పెద్దసంఖ్యలో విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ సంప్రదాయాలను, ప్రజాస్వామ్య భావనలను సమూజంలో ప్రోత్సహించే కార్యక్రమంగా నిలిచందని పరమేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలకు అనుగుణంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ అంద రిని అలరించారు. విద్యార్థినులు పెద్దసంఖ్యలో చేరుకుని బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

## శ్రీ గజలక్ష్మీ అవతారంలో భక్తులకు అమ్మ వారు దర్శనం

**బేగంపేట సెప్టెంబరు 26, ప్రభాతవార్త**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో శుక్రవారం శ్రీగజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మ వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం కావడంతో అమ్మ వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా అమ్మ వారి ఆలయానికి తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.

## స్వామివారికి బంగారు కిరీటం బహుకరణ



వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి బంగారు కిరీటాన్ని అందిస్తున్న దామోదర్‌దాస్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి బంగారు కిరీటాన్ని విశ్రాంత ఆర్టీసి ఉన్నతాధికారి, ప్రముఖ సంఘసేవకుడు దామోదర్‌దాస్ తన ఉదారతను చాటుకున్నారు. నిత్యం ఆధ్యాత్మిక చింతన, భగవంతుడి సేవలో ఉండే దాస్ ఆంజనేయస్వామివారికి వందగ్రాములతో బంగారు కిరీటాన్ని చేయించి శుక్రవారం ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జానకీ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథంకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ దామోదర్ దాస్‌ను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఆలయం అభివృద్ధికి దాతలు ముందుకు రావడం సంతోషంగా ఉందని ఆలయం నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో విశ్వసాహితి సంస్థ కార్యదర్శి గోళ్ళమూడి పద్మావతి, శ్యామ్ మూదిరాజ్, శిశుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మానవీయతకు దర్పణం జాషువా కవిత్వం

**- సిరికొండ మధుసూదనాచారి**



ప్రసంగిస్తున్న రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:**

జాషువా కేవలం దళితుల కోసం సాహితీ సృష్టి చేయలేదు అని ఆయన కవిత్వం మానవీయత కు దర్పణం అని రాష్ట్ర శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు ఇందుకు ఉదాహరణ ఫిరదౌసి కావ్యం అని ఉదహరించారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా గుర్రం జాషువా యాది లో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ నాడు సమాజం లో దళితుల పట్ల విసక్షణ చిన్న చూపు వంటి వాటిని భరించి స్వయం కృషితో ఎదిగిన జాషువా గొప్ప కావ్యాల ను రాసి విశ్వనాథ సత్యనారాయణ వంటి దిగ్గజ పండితుల తో సమంగా నిలిచారు అని వివరించారు ఆయన రచించిన గబ్బిలం కావ్యం దళితుల అవేదన ఆక్రోశం తెలియ పరిస్తుంది అన్నారు తిరుపతి వెంకట కవులు లో ఒకరు ఇన చెల్లిపిళ్ల వెంకట శాస్త్రీ చే కాలికి గండపెండేరం సత్కారం పొందిన మహా సాహితీ వృక్షం జాషువా అని చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయకుడు త్రినాథ రావు వందే భారత్ చిత్ర దర్శకుడు మల్లం రమేష్ సంఘ సేవకుడు వి యెస్ ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు

## 'అక్కినేని-ఇట్క్లా' విశ్వ తెలుగు వెలుగు పురస్కారాల ప్రదానం





పురస్కారాలను ప్రదానం చేస్తున్న ప్రముఖ సినీదర్శకులు, ఇట్క్లా అవార్డుల కమిటీ చైర్మన్ రేలంగి నరసింహారావు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:**

సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం(ఇట్క్లా) అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో 'అక్కినేని-ఇట్క్లా' 'విశ్వ తెలుగు వెలుగు పురస్కారాల ప్రదానోత్సవ సభ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళామారుతి కళావేదికలో దక్షిణమధ్యరైల్వే విశ్రాంత జనరల్ మేనేజరన సి.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నర్సింహరావు చేతులమీదుగా మాస్టర్ ఆఫ్ మిమిక్రి, ధ్వన్యవధాన సమ్రాటన మిమిక్రి శ్రీనివాస్, ప్రముఖ గాయకుడు బి.వినోద్ బాబులకు అందించి గౌరవించారు. కార్యక్రమంలో శతాదిక సినీనిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, రైల్వే జాతీయ కార్మిక నేత పి.యుగంధర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం స్పందించకపోవటం విచారకరం

### తెలంగాణ గిరిజన హాస్టల్ ,ఆశ్రమ పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జేఏసీ నేతలు



నిరవధిక సమ్మె చేస్తున్న గిరిజన హాస్టల్ మరియు ఆశ్రమ పాఠశాలల డైలీవేజ్ వర్కర్లు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన హాస్టల్ మరియు ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు గత పదిహేను రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవటం విచారకరమని డైలీవేజ్ వర్కర్ల జేఏసీ నేతలు ఎం.పాపారావు, బి.మధు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు విలేఖరులతో మాట్లాడుతూ డైలీ వేజ్ వర్కర్లు, కాంటినెంట్ వర్కర్లుగా పనిచేస్తున్న పేదవారిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదన్నారు. చాలీ చాలని వేతనాలతో, అందులోనూ వేతనాలు ప్రతి నెల సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్న మహిళలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి బతుకమ్మ పండుగ కూడా రోడ్లపైనే చేసుకోవలసి రావటం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, డైలీ వేజ్ వర్కర్లకు టైం స్కేల్ విధానం అమలుచేయాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని, ప్రభుత్వం డైలీ వేజ్ వర్కర్లకు న్యాయం చేసేవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### పేదింటి ఆడబిడ్డలకు వరం కళ్యాణ లక్ష్మి పథకం : ఎమ్మెల్యే శ్రీగణేష్



కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**అడ్డగుట్ట,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ కళ్యాణ లక్ష్మి పథకం సిఎం రేవంత్‌రెడ్డి వరమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మారేడ్‌పల్లి మండలానికి చెందిన 9 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కును శుక్రవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి తహశీల్దార్ రాజు నాయక్, ఆర్.ఐ.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్ట్ అథారిటీ నోటీసులతో భయాందోళన చెందవద్దు : మన్నె క్రిశాంక్



అన్నా నగర్ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మన్నె క్రిశాంక్

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా బేగంపేట విమానాశ్రయం అథారిటీ రసూల్ పుర అన్నా నగర్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఇండ్లకు, ఆలయాలకు నోటీసులు జారీ చేయడం సరైంది కాదని బిఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ తెలిపారు. గురువారం రాత్రి అన్నా నగర్, రసూల్ పుర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రక్షణ శాఖ, జారీ చేసిన నోటీసులపై ఆరా తీశారు. రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ జారీ చేసిన నోటీసులపై ప్రజలు ఆందోళన చెంద వద్దని హామీ ఇచ్చారు. ఈ అంశంపై కేంద్రప్రభుత్వం తరుపున న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యాసిన్, జంగిలి రాజు, నర్సింగ్, త్రివేద్ తదితరులు పాల్గొన్నారు.

### బతుకమ్మ, దసరా ఉత్సవాలకు కూన శ్రీశైలం గౌడ్‌కు ఆహ్వానం



కూన శ్రీశైలం గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆహ్వానిస్తున్న సభ్యులు

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను పలువురు ఆహ్వానించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌కి తన నివాసం వద్ద గాజులరామారం, షాపూర్ నగర్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాలకు ముఖ్యతిధిగా ఆహ్వానించారు. అలాగే వీనస్ ఎంక్లేవ్ కాలనీ వాసులు దసరా ఉత్సవాలకు ముఖ్యతిధిగా పాల్గొనాలని కోరడం జరిగింది. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ వారి ఆహ్వానాన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ గుప్తా, శేఖర్, వల్లపు వేణు, సురేష్, శేఖర్, తాటి చంద్రకాంత్, హర్ష గుప్తా, లక్ష్మణ్, ఆనంద మారుతి, ప్రియాంక, శిల్ప, నియోజకవర్గం ప్రజలు, స్థానికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలు షురూ

### అధికారికంగా ప్రారంభించిన క్రీడామంత్రి వాకిటి శ్రీహరి



వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో మంత్రి వాకాటి శ్రీహరి, శివసేనారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 26,ప్రభాతవార్త:**

జాతీయ 17వ మినీ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఆరంభ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి.. తెలంగాణ- అస్సాం మ్యాచ్‌తో పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు మంచి సహకారం అందిస్తోంది. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. క్రీడలు యువతలో మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తాయి. రాష్ట్రంలో హ్యాండ్‌బాల్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందనిఖి అన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాట్జ్ చైర్మన్ శివసేనా రెడ్డి, హెచ్‌ఎఫ్‌ఐ జనరల్ సెక్రటరీ ప్రీత్‌పాల్ సింగ్ సలూజ , తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ సహా చిత్ర తిరుమల్ రెడ్డి, కానపర్తి రమేష్, ఎస్‌ఆర్ సంజీవ్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అండర్12 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు జరుగనుండగా.. 22 రాష్ట్రాల నుంచి జట్లు పోటీపడుతున్నాయి. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అస్సాంపై తెలంగాణ ఘన విజయం సాధించింది.

## టైటిల్ విజేతగా జమాల్ హుస్సేన్ - తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌గోల్ఫ్ టోర్నీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:**

ఎన్ఎస్ఎల్‌లక్స్ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ -2025 టైటిల్‌ను బంగ్లాదేశ్ స్టార్ గోల్ఫర్ జమాల్ హుస్సేన్ కైవసం చేసుకున్నాడు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ (హెచ్‌జీఏ)లో శుక్రవారం జరగాల్సిన ఫైనల్ రౌండ్ భారీ వర్షం కారణంగా రద్దయింది. దీంతో టోర్నమెంట్ ఫలితాన్ని మూడు రౌండ్ల (54 హోల్స్) స్కోర్ల ఆధారంగా ప్రకటించారు. మూడో రౌండ్ ముగిసే సమయానికి అద్భుత స్కోర్‌తో ప్రత్యర్థులపై నాలుగు షాట్ల ఆధిక్యంలో ఉన్న జమాల్ హుస్సేన్‌ను విజేతగా ప్రకటించారు. 40 ఏళ్ల జమాల్‌కు ఇది కెరీర్‌లో ఆరవ టైటిల్. గత నవంబర్ తర్వాత మొదటిది. ఈ విజయంతో అతను రూ. 15 లక్షల ప్రైజ్ మనీ గెలుచుకున్నాడు. ఫలితంగా పీజీటీఐ 2025 ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో 14 నుంచి 10వ స్థానానికి ఎగబాకాడు. చండీగఢ్‌కు చెందిన అక్షయ్ శర్మ రన్నరప్‌గా నిలిచాడు. అతను రూ. 10 లక్షల చెక్‌ను అందుకుని, పీజీటీఐ మెరిట్ జాబితాలో 34వ స్థానం నుంచి 21వ స్థానానికి చేరుకున్నాడు. బెంగళూరు ఆటగాడు ఖలీన్ జోషి మూడో స్థానంలో నిలిచాడు. ఢిల్లీకి చెందిన అర్జున్ ప్రసాద్ ఆరో స్థానంలో నిలిచాడు. ఇక, స్థానిక గోల్ఫర్లలో హైదరాబాద్‌కు చెందిన విశేష్ శర్మ ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. అతను 205 స్కోర్‌తో 22వ స్థానంలో నిలిచాడు.ఈ టోర్నమెంట్‌లో జమాల్ హుస్సేన్ మూడు రౌండ్లలోనూ ఆధిక్యాన్ని ప్రదర్శించి, తన సమీప ప్రత్యర్థులకు ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు.మొదటి రౌండ్ లో టోర్నమెంట్‌లోనే అత్యల్ప స్కోర్ (61) నమోదు చేసి తొలి రోజు నుంచే ఒక షాట్ ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచాడు. తర్వాతి రౌండ్లలోనూ అదే జోరు కొనసాగించాడు.అత్యంత నిలకడైన ఆట తీరుకు నిదర్శనంగా 54 హోల్స్‌లో జమాల్ కేవలం ఒక్క బోగీ మాత్రమే నమోదు చేయడం విశేషం. విజయం అనంతరం జమాల్ హుస్సేన్ మాట్లాడుతూ, "ఈ సీజన్‌లో టైటిల్ గెలిచినందుకు చాలా ఆనందంగా ఉంది. గతంలో రెండు సార్లు టైటిల్‌కు దగ్గరగా వచ్చి విఫలమయ్యాను. ఫైనల్ రౌండ్ ఆడాలని చాలా అనుకున్నాను. కానీ వాతావరణం మన చేతుల్లో లేదు. ఈ వారం మొత్తం నా డ్రైవింగ్, పుట్టింగ్ అద్భుతంగా ఉన్నాయి. మొదటి రౌండ్‌లో సాధించిన 61 స్కోర్ టోర్నీ విజవానికి మంచి పునాది వేసింది. వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే డీపీ వరల్డ్ ఇండియా ఛాంపియన్‌షిప్‌లో రాణించడమే నా తదుపరి లక్ష్యం" అని అన్నాడు. ఈసందర్భంగా విజేతకు మంత్రి జూపల్లి ట్రోఫీని అందజేశారు.





విజేతకు చెక్ అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

## 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లోకి : నవాబ్ ముజాహిద్ అలంఖాన్

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త**

రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లోకి వెళ్తున్నట్లు తెలంగాణ పిసిసి ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి నాయకులు చేస్తున్న ఆరోపణలకు గట్టిగా సమాధానం ఇచ్చారు. రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద గళం విప్పిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు.దేశంలోనే మొదటిసారిగా రేవంత్‌రెడ్డి సర్కారు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయనుండడం చారిత్రాత్మకమైనదని పేర్కొన్నారు. తెలంగాణ మహిళలందరికీ ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమన్నారు.గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నదని తమ ప్రభుత్వమేనన్నారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమన్నారు. సుమారు 2.4లక్షల కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడంతోపాటు వారికి నాణ్యమైన సన్నరకం బియ్యం అందిస్తున్నామని తెలిపారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఏడాది కాలంలో 28వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం ద్వారా 9వేల కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో పేద విద్యార్థులకు ఉచిత వైద్యను అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయ నియామకాల కోసం కేవలం 55 రోజుల్లోనే 11 వేల మంది టీచర్లను నియమించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదన్నారు. బిజెపి పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడంలేదని ఆయన ఆపార్టీ నేతలను నిలదీశారు.



మీడియాతో మాట్లాడుతున్న పిసిసి ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్

### అభివృద్ధిలో నూతన సంక్షేమ సంఘాలు కీలకంగా వ్యవహరించాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**

అభివృద్ధిలో నూతన సంక్షేమ సంఘాలు కీలకంగా వ్యవహరించాలని బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి 2 బిహెచ్‌కె సముదాయం 8వ బ్లాక్ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం 8వ బ్లాక్ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో సమస్యల పరిష్కారంలో ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు సంక్షేమ సంఘం సభ్యులు వారధిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో 8వ బ్లాక్ నూతన చైర్మన్ సామ్య, వైస్ చైర్మన్ దమయంతి, ప్రధాన కార్యదర్శి తస్లీమ్ బేగం, కోశాధికారి ప్రమీల, సభ్యులు అమ్ములు పాల్గొన్నారు.

### బతుకమ్మ మెట్ల పనులను పర్యవేక్షించిన కావలి గణేష్



స్థానికులతో కలిసి పనులను పరిశీలిస్తున్న గణేష్

**దుండిగల్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**

దుండిగల్ గ్రామ పరిధిలోని చిన్న దామరా చెరువు వద్ద బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్మిస్తున్న బతుకమ్మ మెట్ల పనులను ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ ప్రత్యక్షంగా పరిశీలించారు. పండుగకు తక్కువ రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో, ఆయన కాంట్రాక్టర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడుతూ పండుగ రోజున మహిళలు ఇబ్బందులు పడకుండా ఉండేలా మెట్ల నిర్మాణం, చెరువు పరిసరాల అభివృద్ధి పనులు తక్షణమే వేగంగా పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ సాంస్కృతిక గౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, అలాంటి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమయానికి సిద్ధం చేయాలన్నారు. చెరువు పరిసరాల్లో శుభ్రత, మెట్లు, విద్యుత్ లైట్లు, మహిళలకు వసతులు వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, పోతారం మల్లేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అలయ్ బలయ్ వేడుకలకు హాజరు కావాలి : బండారు విజయలక్ష్మి

**అడ్డగుట్ట,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**



తలసానికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కూతురు విజయ లక్ష్మి

తెలంగాణ సాంస్కృతిని చాటి చెప్పేలా నిర్వహించే అలయ్, బలయ్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అలయ్,బలయ్ చైర్‌పర్సన్ బండారు విజయ లక్ష్మి తలసానికి ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చేనెల 3న నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నేతృత్వంలో జరిగే వేడుకలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

### నష్టపరిహారం చెల్లించాలి : ఆకుల సతీష్

**నిజాంపేట్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**



మృతి చెందిన చేపలు

నిజాంపేట్ బండారి లేఅవుట్ శ్రీరాములు కుంటలో వినాయక చవితి సందర్భంగా జరిగిన వినాయకులను తొలగించకపోవడంతో వాటి కెమికల్స్‌తో అందులోని లక్షల రూపాయల చాపలు మరణించాయని ముదిరాజ్ సంఘం నాయ కులు వాపోయారు. సంఘటనకు మొత్తానికి కారణం మున్సిపల్ కార్పొరేషన్, బాధ్యత వహించి చేపలు పట్టుకునే వారికి నష్టపరిహారం చెల్లించాలని, లేని యెడల మున్సిపల్ ఆఫీస్ కమిషనర్ కార్యాలయంలో చేపలు తెచ్చి వేసి నిరసన తెలు పుతామని ఆకుల సతీష్ హెచ్చరించారు

### ఆరోగ్యవంతమైన పురోగతే సమాజ పురోగతి: కె.ఎం.గౌరీష్



స్వస్థనారీ -శక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ కుత్బుల్లాపూర్ డివిజన్ టిఆర్‌ఎస్ అధ్యక్షులు కె.ఎం.గౌరీష్, డాక్టర్.జి.రిషిత తదితరులు

**కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త**

సమాజ అభ్యున్నతి మహిళ ఆర్థిక,సమాజిక ఎదుగుదలపైనే ఆధారపడి వుందని కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీకార్పొరేటర్, టిఆర్‌ఎస్ అధ్యక్షులు కె.ఎం.గౌరీష్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్‌లో అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్‌ప్రైమరీ హెల్త్‌సెంటర్ స్వస్థనారీ-శక్తిపరివార్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళల ఆరోగ్య పరిరక్షణకోసం ప్రత్యేకవైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళల అర్థిక, ఆరోగ్య పరిరక్షణకోసం స్వయంగా తమంత తామే ఎదిగి సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. కుటుంబ పోషణ ఎంతముఖ్యమో కుటుంబం ఆర్థికంగా బలపడేందుకు ఆరోగ్యవంతమైన సమాజం కూడా అంతే ముఖ్యమన్నారు. యుపిహెచ్‌సి ఇంచార్జి ఆఫీసర్ డాక్టర్.ఎన్.సౌందర్య, వెంకటేశ్వరనగర్ అధ్యక్షులు ఎస్.వి.మధుకర్‌రెడ్డి, ప్రతినిధులు భగవాన్‌రెడ్డి,శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### బాలికలు కష్టపడి చదివితే అనుకున్నది సాధిస్తారు



కార్యక్రమంలో పాల్గొన్న కామాటిపుర పోలీస్ స్టేషన్ ఎస్ఐ స్వర్ణ

**చార్మినార్,సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** బాల్యం నుంచి కష్టపడి చదివితే బాలికలు తప్పకుండ అనుకున్నది సాధిస్తారని కామాటిపుర పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణ అన్నారు.దూద్‌బౌలి ఆశ్రిత హోంలో జరిగిన పేరెంట్స్ సమావేశానికి ఆమె ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ స్వర్ణ మాట్లాడుతూ తల్లి దండ్రులు తమ పిల్లలు ఉన్నత విద్య చదువు కోవటానికి సంపూర్ణంగా సహకరించాలని తెలిపారు.ప్రతీ విద్యార్దినీ క్రమశిక్షణతో చదువుకుని మంచి ఉద్యోగాన్ని సంపాదించుకోవాలని ఆమె తెలియజేశారు. అనంతరం బతుకమ్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు బి.శ్యామ్ సుందర్,ఆశ్రిత హోం ప్రోగ్రాం మేనేజర్ వి.పర్వతాలు,శ్రావణి,హోం పర్సనల్ ఇంఛార్జి శిరీష,సోషల్ మొబైలేజర్ అనిత,హోం మేనేజర్ శ్రీజ, ప్రతినిధులు స్వాతి,శారద,నగ్మా,శివమ్మ పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త**

ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలనీ, 2 లక్షల నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ గత 13 రోజులుగ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అశోక్ అకాడెమీ చైర్మన్ అశోక్ కుమార్‌ను పోలీసు చికిత్స నిమిత్తం ఉస్మానియాలో చేర్పించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆయన గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలోనూ దీక్ష కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో స్పందించిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీసీ నేత గుజ్జ కృష్ణ నిరుద్యోగ అభ్యర్థులు, భాజపా,వివిధ ప్రజా సంఘాల నేతలు అశోక్ కుమార్‌ను పరామర్శించారు నిరుద్యోగ అభ్యర్థుల ఉద్యోగాల కోసం తమ వంతు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం ఆయనకు నచ్చజెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేస్తామని రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య నచ్చజెప్పడంతో అశోక్ విరమింపజేసేందుకు అంగీకరించారు. ఆయన సమక్షంలో నిరుద్యోగ అభ్యర్థులకు అశోక్ కుమార్‌కు కొబ్బరి బొండం నీళ్లు తాగించి దీక్ష విరమింపజేశారు.



అమరణ నిరాహార దీక్ష చేపట్టిన అశోక్‌ను దీక్ష విమరింపచేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ, పోలీసు, విద్యుత్తు, అన్ని విభాగాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పదవీ పొందిన వారి స్థానంలో కొత్తగా గ్రూప్1,2,3 నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగులతో కల్సి ఉద్యమాన్ని చేస్తామని ఆయన వెల్లడించారు. వివిధ సంఘాల ప్రతినిధులు చిరంజీవులు, నీల వెంకట్ చెరుకు మణికంత, రాజు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొనా అశోక్ కుమార్ సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకునేంత వరకూ ఉస్మానియాలో చికిత్స అందించాలని ఉస్మానియా వైద్యులకు ఆర్. కృష్ణయ్య సూచించారు.

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**అత్తాపూర్ సెప్టెంబరు26,ప్రభాతవార్త :**

సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకలుగా బతుకమ్మ వేడుకలు నిలుస్తున్నాయని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,సర్కిల్ డిసి సురేందర్ రెడ్డిలు పేర్కొన్నారు.శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో వేడుకలు అమరాన్నంటాయి.అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు తిరుగుతూ ఆడిపాడారు. అనంతరం వివిధ ప్రాంతాల నుండి తీసుకొచ్చిన బతుకమ్మలకు మొదటి,ద్వితీయ ,తృతీయ బహుమతులను కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి,సంగీత గౌరి శంకర్,డిసి సురేందర్ రెడ్డి ,డిపిఒ స్వాతి లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని బతుకమ్మ పండుగ విశ్వవ్యాప్తంగా చాటుతోందని అన్నారు.అడ్డబిడ్డలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలందరి బతుకుల్లో వెలుగులు నింపుతూ మరింతగా సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలని ప్రార్థించారు.బతుకమ్మ పండగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సిబ్బంది ,సీఓలు విజయ్, విజయేందర్, లక్ష్మణ్, రేణుక కూడా పాల్గొన్నారు.



## గజలక్ష్మీ దేవిగా బల్కంపేట ఎల్లమ్మ

**సంజీవరెడ్డి నగర్,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**



వివిధ కరెన్సీ నోట్లతో, నాణెములతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలోని మూల విరాట్ అమ్మవారిని వివిధ రకాల కరెన్సీనోట్లు, నాణెములతో అలంకరించగా అమ్మవారు గజ లక్ష్మి దేవిగా భక్తులక దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలలో పాల్గొని అనంతరం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమతో పాటు ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమలకు అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అందజేసి శాలువలతో సత్కరించిన ఆలయ సూపరిండెంట్ హైమావతి, ఆలయ సిబ్బంది తదితరులు

## పాతబస్తీ సౌత్ సర్కిల్ ఎస్ఈగా శ్రీనివాస్



విద్యుత్ సౌత్ సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన టి.శ్రీనివాస్‌ను అభినందిస్తున్న చార్మినార్ డిఈ శ్రీధర్,ఏడిఈలు వెంకటేష్ గౌడ్,రాజు,మక్సూద్

**చార్మినార్,సెప్టెంబరు 26 ప్రభాతవార్త :**

టిజిఎస్‌పిటిసిఎల్ సౌత్ సర్కిల్ నూతన ఎస్ఈగా టి.శ్రీనివాస్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లా విద్యుత్ డిఈగా విధులు నిర్వహించిన టి.శ్రీనివాస్ పదోన్నతిపై హైదరాబాద్ పాతబస్తీ సౌత్ సర్కిల్ సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీరుగా నియమితులయ్యారు.కాగా చార్మినార్ డిఈ శ్రీధర్,మీరాలం ఏడిఈ వెంకటేష్ గౌడ్,ఫలక్‌నుమా ఏడిఈ రాజు,చార్మినార్ ఏడిఈ మక్సూద్ కొత్త సౌత్ సర్కిల్ ఎస్ఈ శ్రీనివాస్‌ను కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.ఇంత వరకు సౌత్ సర్కిల్ ఇంఛార్జి ఎస్ఈగా విధులు నిర్వహించిన వెంకన్న స్థానంలో టి.శ్రీనివాస్ ఎస్ఈగా నియమితులయ్యారు.

## ఐటి ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇవ్వండి

**హైదరాబాద్,సెప్టెంబరు26, ప్రభాతవార్త**

భారీవర్షాల నేపథ్యంలో ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోమ్ ఇవ్వాలని సైబరాబాద్ పోలీసులు ఐటీ కంపెనీలకు విజ్ఞప్తి చేశారు. శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. శుక్ర,శనివారాల్లో హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే.ఇప్పటికే గురువారం రాత్రి నుంచి హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఐటీ పరిశ్రమలు అత్యధికంగా ఉన్న సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి, కొండాపూర్, కోకాపేట్, నానక్‌రామ్ గూడలో సాధారణ రోజుల్లోనే భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది .ఇబ్బందులకు గురికాకుండా కొన్ని రోజులు వర్క్‌ఫ్రం హోం మేలు అని సూచిస్తున్నారు.


IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE CUM VI JMFC, MEDCHAL-MALKAJGIRI AT L.B. NAGAR.

O.S. NO. 1112 OF 2025

Between:

**Chedudoop Ashok & 2 others** ...Plaintiffs

**The Tahasildar, Uppal Mandal, Medchal- Malkajgiri district. & others** ...Defendants

To,

**All concerned (Defendant No.2)**

Please take notice that the above suit vide O.S. No. 1112 of 2025 is filed by the plaintiffs against the defendants to declare them as legal heir of Late Chedudoop Sujatha and the said suit is posted on **07.10.2025** for your appearance and counter if any, therefore you are hereby called upon to appear either in person or through an advocate in the above suit before the above said court on **07.10.2025 at 10.30 AM** failing which the suit will be decided on merits in your absence.

//by order of the Hon'ble court//

**Sd/- CH. KRISHNA KUMAR**
**Advocate**
**Ph: 9966667788**


### కోళ్ళ పరిశ్రమ స్థితిగతులపై సాంకేతిక సదస్సు



**అత్తాపూర్ సెప్టెంబరు26,ప్రభాతవార్త :**

ఇండియన్ పౌల్టీ సైన్స్ హైదరాబాద్ చాప్టర్ మరియు కోళ్ళ శాస్త్ర విభాగం, పశు వైద్య కళాశాల, రాజేంద్ర నగర్, పీవీ నరసింహారావు పశువైద్య యూనివర్సిటీ సంయుక్తంగా సాంకేతిక సదస్సును రాజేంద్రనగర్‌లోని పశువైద్య విశ్వ విద్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా విశ్వవిద్యాలయం ఉపకులపతి జ్ఞానప్రకాష్ మరియ ఐసిఎఆర్‌డిపిఆర్ డైరెక్టర్ చట్టర్జీ, డీన్ ఉదయ్ కుమార్, అసోసియేట్ డీన్ డా మాధురి ,ఐ పిఇఎంఎ అధ్యక్షులు ఉదసింగ్ భయన్‌లు హాజరై కోళ్ళ పరిశ్రమ ప్రస్తుత స్థితి గతులు మరియు ఏవియన్ ఇన్‌ఫ్లూయాంజా నివారణ చర్యలు చర్చించారు. ఈ కార్యక్రమంలో డా.హనుమంత్ రావు ,పశు వైద్య అధ్యపకులు, పీజీ,పీహెచ్‌డి విద్యార్థులు,డిపిఆర్ శాస్త్రవేత్తలు మరియు కోళ్ళ పరిశ్రను నిపుణులు, కోళ్ళ శాస్త్ర విభాగానికి చెందిన విద్యాపకులు పాల్గొన్నారు.

### హైడ్రా బాధితులకు అండగా నిలుస్తాం : ఎమ్మెల్యే

**జీడిమెట్ల, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**

125 గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్, గాలి పోచమ్మ బస్తీలలో బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పర్యటించి ఇటీవల హైడ్రా అధికారులు కూల్చివేసిన ఇళ్లను, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద వాళ్ల ఉంటున్న నివాసాలను, పండుగ పూట అధికారులు కూల్చివేయడం దారుణమన్నారు. ఈ కూల్చివేతలపై త్వరలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి పూర్తి సమాచారం అందజేసి బాధితులకు అండగా ఉండి న్యాయం చేస్తామన్నారు.

## వృక్ష పెంపకందారుల ఉత్సవం

**కొంపల్లి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**

ధూలపల్లిలోని అటవీ జీవవైవిధ్య ప్రాంగణంలో శుక్రవారం వృక్ష పెంపకందారుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అటవీ ఉత్పత్తుల ప్రాముఖ్యతను చర్చించడానికి రైతులు, శాస్త్రవేత్తలు ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ ఉత్సవం యొక్క ప్రధాన లక్ష్యం. స్థిరమైన అభివృద్ధి వైపు ముందుకు సాగడానికి అవసరమైన పద్ధతులను కూడా వారు చర్చించారు. ఈ ఉత్సవంలో అటవీ ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఐ.ఎఫ్. బి ఫారెస్ట్ కాలేజ్ ములుగు, తెలంగాణ మెడిసినల్ ప్లాంట్స్ ఇన్స్టిట్యూట్, అలాగే ట్రైబల్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐ.ఎఫ్.ఎస్ (రిటైర్డ్) స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమీషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, ఐ.ఎఫ్.ఎస్ డైరెక్టర్ ఈ. వెంకట్ రెడ్డి, డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ పట్నాయక్, సందీప్ ప్రతీ, డాక్టర్ పంకజ్ సింగ్, రైతులు సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL

S.O.P. No. 9 of 2025

BETWEEN:

**Kandula Alluraiah** S/o. Late K. Chinna Kasaiah, A/a. 50 yrs, Occ: Business, R/o. Flat No.401, S K Homes, Sri Chaitanya College Road, Nizampet, M.M. District, T.G.-500090. ...Petitioner

AND

**1. The Special Deputy Collector,** Land Acquisition, GHMC, Hyderabad.

**2. ALL CONCERNED** ...Respondents

Take notice.

In the above matter, petitioner filed the petition for obtaining succession certificate in favour of petitioner in respect to L.A.O.P.No. 40 of 2021 on the file of Hon'ble Land Acquisition, Rehabilitation & Resettlement Authority for the Sate of Telangana at Hyderabad and the matter is posted on **22-10-2025** for the appearance of the respondents and if any interested third-party persons for calling the objections. Hence, this notice.

By Order

**Kaatrapati Mani Rama Chandra**
**Advocate**
**Counsel for the Petitioner.**
# 2-2-1127, F-2, Siddhartha Mansion, New Nallakunta, Hyderabad.

## వెంకటేశ్వర కాలనీ అభివృద్ధి కి కృషి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న వెంకటేశ్వర కాలనీ ప్రతినిధులు.

వనస్థలిపురం. సెప్టెంబర్.26.ప్రభాతవార్త
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ని వారి కార్యాలయంలో కలిసి కాలనీలో 15.50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న పార్క్ అందులో భాగంగా వాటర్ బోర్ను వేయించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కాలనీలో కొంతమేర నూతన రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ని కోరారు. స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే కాలనీ లోని ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం. జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ చారి, ట్రెజరర్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, సలహాదారుడు రామానాయుడు, జాయింట్ సెక్రెటరీ రాజు మరియు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ సభ్యులు ఉన్నారు.

## గొప్ప పండుగ బతుకమ్మ ఉత్సవాలు



విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్న ప్రగతి జూనియర్, డిగ్రీ మహిళా కళాశాల డైరెక్టర్లు మంజు రెడ్డి, ఆర్. కరుణ శ్రీ తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** ప్రకృతితో ప్రత్యక్ష సంబంధం కలిగిన గొప్ప పండుగ బతుకమ్మ ఉత్సవాలని ప్రగతి జూనియర్, డిగ్రీ మహిళా కళాశాల డైరెక్టర్లు మంజు రెడ్డి, ఆర్. కరుణ శ్రీలు పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లోని ప్రగతి జూనియర్, డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు సాంప్రదాయక దుస్తులు ధరించి వివిధ రకాల రంగు రంగుల పూలతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను సుందరంగా పేర్చి పూజలు నిర్వహించి, ఉత్సాహంగా ఆటలు, పాటలు పాడుతూ ఘనంగా బతుకమ్మ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి జూనియర్, డిగ్రీ మహిళా కళాశాల డైరెక్టర్లు మంజు రెడ్డి, ఆర్. కరుణ శ్రీలు మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ : డిఇ విష్ణువర్ధన్ రెడ్డి



ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, మహిళా ఉద్యోగస్తులు తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ ఉత్సవాలు నిలుస్తాయని ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ కార్యాలయంలో డిఇ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో, భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను సుందరంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఘనంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతితో ప్రత్యక్ష సంబంధం కలిగిన అతి పెద్ద పండుగ బతుకమ్మ పండుగ అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఏడీఇలు వినోద్ రెడ్డి, శోభన్ బాబు, ఏఇలు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, సంతోష్ బాబు లతోపాటు మహిళా ఉద్యోగస్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పర్యటన

**నేరెడ్ మెట్, సెప్టెంబర్ 26 (ప్రభాతవార్త):** ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, అభివృద్ధి పనులు చేయడమే కాకుండా ప్రజాసేవలోనూ ముందంజలో కొనసాగుతున్న నాయకురాలిగా కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ పేరు గాంచారు. సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే స్పందించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఆమె ప్రత్యేకత. స్థానిక ప్రజలు మాట్లాడుతూ...క్యానం రాజ్యలక్ష్మీ ఎల్లప్పుడూ మన పక్కనే ఉంటారు. సమస్యలు చెప్పగానే వెంటనే స్పందించి పరిష్కారం చూపిస్తారు" అని ప్రశంసించారు. అభివృద్ధి పనులకు కృషి వినాయక నగర్ డివిజన్ పరిధిలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రాథమిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, ప్రజల కోసం నిధులు సమకూర్చడంలో ముందున్నారు. ఇప్పటికే అనేక కాలనీల్లో సీసీ రోడ్లు, స్టోర్మ్ వాటర్ డ్రైన్లు పూర్తి చేయించగా, విద్యుత్ దీపాల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకున్నారు. సేవా కార్యక్రమాలు పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు చదువు సామగ్రి, మహిళలకు ఆత్మవిశ్వాసం పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించి ప్రజల్లో ఐక్యతను పెంచడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్విరామంగా చేస్తున్నారు.

## అమ్మవారికి మర్రి మమత ప్రత్యేక పూజలు



మల్కాజిగిరి సెప్టెంబర్ 26,ప్రభాతవార్త :
మల్కాజ్గిరి డివిజన్ పరిధిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం మరియు శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయాలలో శ్రీదేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే సతీమణి మర్రి మమత రాజశేఖర్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ శ్రీమతి నిర్గొండ మంజుల జగదీష్ గౌడ్ గార్లు పాల్గొని అమ్మవారిని దర్శించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమానికి స్థానిక మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత : మాజీ మేయర్ పారిజాత



మల్లాపూర్‌లో డిఫెన్స్ అధికారులతో కలిసి శ్రమదానం ద్వారా పరిసరాలను శుభ్రం చేస్తున్న మాజీ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఆర్‌సిఐ-డిఆర్‌డిఓ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పారిజాత డిఫెన్స్ అధికారులతో కలిసి శ్రమదానం ద్వారా పరిసరాలను పరిశుభ్రం చేసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సానిటేషన్ సిబ్బంది, ప్రజల సహకారంతో గతంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు స్వచ్ఛత అవార్డు సాధించడం జరిగిందని గుర్తు చేశారు. స్వచ్ఛ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆమె ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ అధికారులు అచ్యుత రామయ్య, లెఫ్టినెంట్ కల్నల్ వికె రాజు, బి.ప్రభాకర్, ధనేంద్ర త్రిపాఠి, తిరుమల్‌రావు, సనాతన్‌కుమార్, రవీందర్, ప్రభాత్ కుమార్, బడంగ్‌పేట్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఎఎంసి జాన్ కృపాకర్, సానిటేషన్ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



చిలుకానగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు



రామంతాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :**
తెలంగాణ సాయుధపోరాటయోధురాలు చాకలి ఐలమ్మ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చిలుకానగర్ డివిజన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, బిఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి తదితరులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు బిఆర్‌ఎస్ పార్టీ నేతలు, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు

**రామంతాపూర్‌లో..**
తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా రామంతాపూర్ చిన్న చెరువు వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్ రజక సంఘం నాయకులు దానయ్య, జిత్తు, కృష్ణ, రవి, సత్యనారాయణ, ప్రసాద్, విజయ్, చిట్టి, అరుణ్ సాయి, భీమేష్, రాజేష్, శంకర్, శ్రీనివాస్, బిక్షపతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తౌఫిక్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు రఫిక్, గరిక సుధాకర్, జలీల్ పాషా, ఉపేందర్ రెడ్డి, రాజి రెడ్డి, భాస్కర్ గంగ పుత్ర, లుకాస్, ముత్యాల జంగయ్య, ముత్యాల బాబు, సత్తి రెడ్డి, సుధాకర్, కే స్వామి, జి. స్వామి, అలీమ్, బుల్లెట్ అశోక్, సందీప్, భాస్కర్, జిల్లు, జంగయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో....**
రామంతాపూర్‌లో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో బిజెపి కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ రజక సేవా సంఘం అధ్యక్షులు దానయ్య, గౌరవ అధ్యక్షులు బొడ్డుపల్లి రవి, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి జిత్తు, కోశాధికారి బొడ్డుపల్లి సత్యనారాయణ, కృష్ణ, శంకర్, ఆనంద్, ముత్యం, చిన్న శంకర్, భీమేష్, శ్రీను, లింగం, రాజేష్, బిక్షపతి, బాలరాజ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఎన్‌డిపి పనులకు నిధులు మంజూరు చేయాలి



ఎస్‌ఎన్‌డిపి చీఫ్ ఇంజనీర్ జ్యోతిర్మయికి వినతి పత్రం ఇస్తున్న కామేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ నాయక్ తదితరులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లలో వరద ముంపు సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ఎస్‌ఎన్‌డిపి నాలాల పనుల కోసం నిధులను మంజూరు చేయాలని ఆయా కార్పొరేషన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఎస్‌ఎన్‌డిపి చీఫ్ ఇంజనీర్ జ్యోతిర్మయిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు ఆమెను కలిసి ఎస్‌ఎన్‌డిపి పనులు పూర్తి కాకపోవడంతో వర్షాలు కురుస్తున్నప్పుడు ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. ఎస్ఎన్‌డిపి ఫేస్-1, 2 ల చేపట్టే ప్రతిపాదన పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, బడంగ్‌పేట్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, మీర్‌పేట్ మాజీ ఎంపిటిసి జె.శ్రీనివాస్ నాయక్, దిండు భూపేష్‌గౌడ్, మాదరి రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### బాల సంస్కార కేంద్రం చిన్నారులకు పుస్తకాల పంపిణి



పుస్తకాలను పంపిణీ చేస్తున్న నిమ్మల సునీతా శ్రీకాంత్‌గౌడ్

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** నాదర్‌గుల్ విద్యాభారతి విజ్ఞాన కేంద్రం అనుబంధ సేవా బస్తీ గాంధీనగర్‌లోనున్న శ్రీ సరస్వతి బాల సంస్కార కేంద్రంలో చిన్నారులకు విజ్ఞాన పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాదర్‌గుల్ ప్రబంధకారిణి సభ్యురాలు, మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్‌గౌడ్ చిన్నారులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ విభాగ్ సేవా సంయోజక్ రాఘవరెడ్డి, పాఠశాల సేవా సంయోజక్ రచన, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారి పూజల పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**
దేవి శరన్న వ రాత్రి ఉత్స వాలలో భాగం గా మహాలక్ష్మీ దేవికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చి లుక ఉపేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని గ్రీన్‌హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 5వ రోజు శ్రీమహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేగట్టే నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, నరసింహారావు, దయాకర్ రెడ్డి, మదన్‌మోహన్‌గుప్తా, నారాయణరెడ్డి, సతీష్‌గౌడ్, వేణుగోపాల్, జంగారెడ్డి, సత్యనారాయణ, ప్రకాష్, శేఖర్‌రావ్, వెంకటేశ్వర్‌రావు, మామిడి రామ కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో దుర్గామాతకు అందెల పూజలు



దుర్గామాతకు పూజలు నిర్వహించిన అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**
శ్రీదేవి శరన్నవ రాత్రుల సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జి, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల బిజెపి కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత మండపం సందర్శించి పూజలు చేసిన ఆయనను ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, పసునూరి బిక్షపతిచారి, నాయకులు ఆర్.యాదగిరి యాదవ్, ద్యాసాని తిరుపతిరెడ్డి, చిలంపల్లి రాజశేఖర్, వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీమహాలక్ష్మిదేవి అవతారంలో అమ్మవారి దర్శనం



అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న గురుమాత వెంకటమ్మ

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లోని శ్రీదుర్గాభవాని శ్రీరేణుకఎల్లమ్మ దేవాలయంలో నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా 5వ రోజైన శుక్రవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మిదేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవాలయం వ్యవస్థాపకురాలు, గురుమాత, శ్రీమాతా శక్తిపీఠందేవి ఉపాసకురాలు సోమ వెంకటమ్మ ఆధ్వర్యంలో శ్రీమహాలక్ష్మిదేవి అమ్మవారికి శాస్రోయుక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వెంకటమ్మ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, పాడిపంటలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు.

### మహంకాళి ఆలయంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు



శ్రీ మహాలక్ష్మిదేవిగా పుష్పాభిషేకం నిర్వహిస్తున్న మాజీ చైర్మన్ డి.శ్రీనివాస్ దంపతులు దృశ్యం.

**రామంతాపూర్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని న్యూ గోఖలేనగర్‌లోని శ్రీ మహంకాళి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటి స్థాపక అధ్యక్షులు సుర్వి భీష్మగౌడ్, మాజీ చైర్మన్ ధీకొండ శ్రీనివాస్, కోశాధికారి సముద్రాల నాగేందర్ అధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, దేవి అభిషేకం, తిరుమంజన సేవ, దేవి అలంకరణ, ప్రభాత దర్శనం, ఏకాదశ హారతులు, చతుష్టపచార పూజలు, కుంభ హారతి, తీర్థ ప్రసాద వితరణ, దుర్గా హోమం, సాయంత్రం ప్రదోషకాల, చతుషష్టపచార పూజ, సామూహిక అష్టోత్తర కుంకుమార్చనలు, నక్షత్ర హారతి, తీర్థ ప్రసాద వితరణ, ఏకాంత సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శుక్రవారం శ్రీ మహాలక్ష్మిదేవిగా అలంకరించి పుష్పాభిషేకం నిర్వహించారు.

## చాకలి ఐలమ్మకు కార్పొరేటర్ నివాళి



మల్కాజిగిరి సెప్టెంబర్ 26,ప్రభాతవార్త :
తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని జ్యోతి నగర్ గ్రౌండ్లో గల ఆమె విగ్రహానికి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రామ యాదవ్ మరియు రజక సంఘం ప్రతినిధులతో కలిసి ఆమె శుక్రవారం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ సేవలను కొని ఆడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ మరియు రజక సంఘం నాయకులు బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## చాకలి ఐలమ్మ స్ఫూర్తి మరువలేనిది : దేప



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటంలో వీరవనిత ఐలమ్మ స్ఫూర్తి మరవలేమని టీపిసిసి ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పగడాల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్‌లో చాకలి ఐలమ్మ 130వ జయంతి కార్యక్రమానికి దేప భాస్కర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా గణేష్‌నేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డిలు హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ లాంటి నిస్వార్థ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి మధు, బొడ్డుపల్లి మహేందర్, జ్ఞానేశ్వర్‌యాదవ్, పగడాల శ్రీశైలం, రామకృష్ణగౌడ్, బొడ్డుపల్లి నగేష్, అంజి, నర్సింహచారి, కిట్టు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తికి నిదర్శనం బతుకమ్మ ఉత్సవాలు



అనిబీసెంట్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ రాజవల్లి తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:**
మహిళా శక్తి నిదర్శనం బతుకమ్మ ఉత్సవాలను కనిబీసెంట్ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ అనిబీసెంట్ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయక దుస్తులు ధరించి వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను సుందరంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఘనంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. కళాశాలలో జరిగిన బతుకమ్మ ఉత్సవాలకు తెలంగాణ మహిళా కమిషన్ సెక్రెటరీ ముఖ్య అతిథిగా పద్మజ విచ్చేసి నవరాత్రి, బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు మహిళల రక్షణ, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలు ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజవల్లి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లీనింగ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్



మల్కాజిగిరి సెప్టెంబర్ 26,ప్రభాతవార్త :
ఈస్ట్ ఆనంద్ బాగ్ పరిధిలోని పి వి ఎన్ కాలనీ సత్తి రెడ్డి నగర్, సత్య రాఘవేంద్ర కాలనీ. ఏరియాలలో నాలాలు బాక్స్ డ్రైన్లు వర్షానికి బ్లాక్ అయిన ఏరియాలలో క్లీనింగ్ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది వర్షాలకు నాలాలు బాక్స్ డ్రైన్ లు క్లీనింగ్ పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కోరడం జరిగింది ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని సమస్య పరిష్కరించాలని వారిని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఈ ఈ లక్ష్మీ డిజి లౌక్యా సత్యలక్ష్మీకాలనీవాసులు గీత భాగ్యలక్ష్మీ శోభ విజయ గౌరమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్,టీచర్స్ మీటింగ్



మీటింగ్‌లో పాల్గొన్న ముఖ్య అతిథిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్

**హుడా కాంప్లెక్స్, సెప్టెంబర్ 26 , ప్రభాతవార్త:**
ప్రభుత్వ జూనియర్ కళాశాల సరూర్ నగర్ (రంగారెడ్డి జిల్లా)లో ఇంటర్ విద్యా సంచాలకుడు కృష్ణ ఆదిత్య ఆదేశానుసారంతో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ శుక్రవారం భారీ ఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ (సీఓఈ) జయప్రద భాయ్, రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్య పర్యవేక్షణ అధికారి వెంక్యా నాయక్ విచ్చేసి మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో పాల్గొని పలు సూచనలు/సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తల్లిదండ్రులు హాజరై, ప్రధాన ఆచార్యుల కళాశాల నిర్వహణ తీరును, ఉపన్యాసకుల బోధన పద్ధతులను అభినందించి, ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమం కోసం ఎంతో సమయం వెచ్చించి, ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో ఇంటరాక్ట్ అయిన సిఓఇకి ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపక బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తదుపరి కళాశాల మైదానంలో విద్యార్థిని విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయ బృందం బతుకమ్మ పండుగను ఆటపాటలతో ఉత్సాహంగా జరుపుకున్నారు.

## వడ్డెర వడ్డీల సంఘాలను ఏకం చేయడానికి కృషి



జిహెచ్ఎంసి అధ్యక్షులు బోదాసు రవిని సన్మానిస్తున్న మల్లేష్ బృందం.

**కుషాయిగూడ, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త**
జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వడ్డెర వడ్డీ సంఘాలను ఏకం చేసే క్రమంలో ముందుకు సాగుతున్నామని జాతీయ వడ్డెర సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బోదాసు రవి పేర్కొన్నారు. గత కొంతకాలంగా తెలంగాణ ఉద్యమాలతో పాటు వడ్డెర సంక్షేమ కోసం కృషి చేస్తున్న ఆయన సేవలను గుర్తించి జాతీయ వడ్డెర సంఘం ఆయనను జిహెచ్ఎంసి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా నియమించింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఇతర కాలనీ సంఘాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల సంస్కరణ కోసం మాత్రమే నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు పదవుల కోసం ఆశించి సంఘాలను విచ్ఛిన్నం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజా మల్లేష్, త్రిపాటి పాండవుల బసవయ్య, నీరటి బాలు, జయంత్ లు పాల్గొన్నారు.

### సమాజానికి తమ వంతు సేవలు అందిస్తున్నాం : ప్రిన్సిపల్



తేజస్వి ఫౌండేషన్ ఫర్ డిసేబుల్డ్ సంస్థకు నిత్యవసర వస్తువులు, బ్రెయిలీ పుస్తకాలను అందజేస్తున్న అవంతి కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, విద్యార్థులు తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:**
సమాజానికి తమ వంతు సేవలు అందిస్తున్నామని మూసారాంబాగ్ అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ డే ఉత్సవాలను పురస్కరించుకుని అవంతి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు తేజస్వి ఫౌండేషన్ ఫర్ డిసేబుల్డ్ సంస్థను సందర్శించి రూ 20 వేల విలువలను నిత్యవసర వస్తువులను అందజేయడంతో పాటు రూ. 15 వేల విలువ గల బ్రెయిలీ పుస్తకాలను త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. కళాశాల విద్యార్థులు సంస్థలోని అందులతో పలు అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ డే ఉత్సవాలను పురస్కరించుకొని ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులతో కలిసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ లోవ, విద్యార్థులు అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి ఆలయంలో పద్మావతి అమ్మవారికి విశేష కుంకుమార్చన



శ్రీ పద్మావతి అమ్మవారికి విశేష కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు.

వనస్థలిపురం. సెప్టెంబర్.26.ప్రభాతవార్త
వనస్థలిపురం సచివాలయ నగర్ లో గల శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ పద్మావతీ అమ్మవారికి శనివారం విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ప్రతినిత్యం తిరుమల లో స్వామివారి కి ఏవిధంగా పూజలు నిర్వహిస్తారో అదే విధంగా ఇక్కడ స్వామివారి కి అదే విధంగా పూజలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి శ్రీధర్, జాయింట్ కోశాధికారి రామలక్ష్మీ పాల్గొన్నారు.

## దేవాలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ రాజ రాజేశ్వరి నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో రూ.3.20లక్షల వ్యయంతో చేపడుతున్న షెడ్, గ్రిల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, జమున, హనుమంతు, భాస్కర్, శ్రీను, ఈశ్వర్, తార, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పూలనే దైవంగా కొలిచే పండుగ బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** జన శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ ఎల్ఐసిహెచ్ కాలనీలోని మహిళా భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ వృత్తులలో శిక్షణ పొందుతున్న మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ పూలనే దైవంగా కొలిచే పండుగ బతుకమ్మ అని అన్నారు.

## వంజరి కులస్థులు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి



మాట్లాడుతున్న వంజరి సంఘం నాయకులు

**తార్నాక, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** రాష్ట్ర వంజరి సంఘం కార్యాలయం తార్నాకలో శుక్రవారం వంజరి కులస్థుల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కాలేరు నరెందర్ మాట్లాడుతూ వంజరి కులస్థుల విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. వృద్ధులకు పెన్షన్లు ఇస్తున్నామని చెప్పారు. విధ్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేష్, కోషాధికారి కాలేరు అమరెందర్ పాల్గొన్నారు.